# మలుపు

వి.రేణుక



**దాహంతో** ఉన్న బాటసారికి నుయ్యి కనిపించి నప్పుడు ఆనందంతో ఉప్పొంగిపోతాడు. అందులో ఉండేది ఉప్పు నీరైతే కుంగి పోతాడు. కనుచూపు మేరలో మరొక నుయ్యి కనిపించినా— అంతవరకు నడవ లేని పరిస్థితిలో అతని ఆవేదనకు అంతుండదు.

సరిగ్గా అలాంటి స్థితిలో ఇరుక్కుపోయింది క్రిస్టినా.

కిటికీలోంచి బయటికి చూస్తూ, మంచం మీద పడుకున్న ఆమెకు చీకటి తప్ప మరేమీ కనిపించడం లేదు— తన పక్క బాబు అమాయకంగా నిద్ర పోతున్నాడు.

ఆలోచనలతో నలిగి పోతూం దామె.

విలియమ్స్ ఎంత అందంగా ఉంటాడు! వేగంగా వెళ్ళి అతని చేతుల్లో వాలి పోవా లనిపిస్తుంది. కానీ! కానీ! తన కోరిక తీరుస్తాడో, లేదో?

ఏం? ఎందుకు తీర్చడు? వయసులో ఉన్న అంద మైన అతివ వలచి వస్తే కాదనే వా రెవరుంటారు? ప్చ్! తన కా అదృష్టం ఉందా?

క్రిస్టినా హృదయమంతా వికలమైంది— ఆలోచనల నుండి బయట పడి నిద్ర పోవాలని ఎంతో ప్రయత్నిస్తోంది. గోడ గడియారం రెండు సార్లు గంట కొట్టింది.

మరో మంచం మీద రాబర్ట్ హాయిగా నిద్ర పోతున్నాడు. క్రిస్టినా కళ్ళు మూసుకొని ఆలోచి స్తోంది. అలా ఆలోచిస్తూనే... గతమంతా ఆమె మనసులో కదిలింది.

● ● ● ●

రాబర్ట్‌తో ఆమెకు పెళ్ళయి ఏడు సంవత్స రాలైంది. ఆమె మనఃస్ఫూర్తిగా అతన్ని వివాహం చేసుకుంది. జీవితంలో మూడు సంవత్సరాలు ఇట్టే దొర్లిపోయాయి.

ఆ తరవాత ఆమెను కదిలించి వేసే ఒక విషయం తెలిసి చాలా కుంగి పోయింది—రాబర్ట్ శరీరంలో ఒక భయంకర మైన వ్యాధి ఉందని, అది పెళ్ళి కాక పూర్వం నుండే గూడు కట్టుకుని ఉందనీ! ఎంత చికిత్స చేసినా రోజు రోజుకు ఆ వ్యాధి పెరిగి పోసాగింది. రాబర్ట్ వ్యాధితో బాధ పడుతున్నాడు.

ఆమె ఆందవమైంది.

అతనిలో అనేకమైన ఆలోచనలు.

ఆమెకు తన వ్యాధి గురించి తెలియకుండా ఉంచి, ఆమెను మోసగించి పెళ్ళి చేసుకున్నందుకు తనని అసహ్యించుకుంటుందేమోనని అనుమానం రాబర్ట్‌ది.

ఆదివారం చర్చికి పోయినప్పుడు మాస్ (ప్రార్థన) అయ్యాక ఒకర్నొకరు విష్ చేసు కోవడం సహజం. చర్చిలో తెలిసిన మగాళ్ళతో మాట్లాడుతూంటే, ఆమె కళ్ళలో కామమే ఉంటుం దని అపోహ పడి మానసికంగా ఆమెను హింసించే అలవాటయింది రాబర్ట్‌కి!

● ● ● ●

కానీ, రాబర్ట్‌కు తెలియదు—క్రిస్టినా ప్రతి ఆదివారం రాబర్ట్, బాబుల గురించి మంచి ఆరోగ్యంతో ఉండాలని ఏసుప్రభువును కోరుతూ ఉంటూందని.

ఎంత నిజాయితీ, సహనంగా ఉన్నా రాబర్ట్ అర్థం చేసుకోలేకపోతున్నాడు.

రోజూ ఏదో విషయంలో చిల్లర తగవులు పెట్టుకుంటూ ఉంటాడు. అప్పుడప్పుడు తాగి వచ్చి మరీ పేచీ పెట్టుకుంటాడు. ఆమె జీవితం పట్ల అతనికి రవ్వంత సానుభూతి లేదు.

● ● ● ●

సంవత్సరం క్రితం విలియమ్స్ తన భర్త ఆఫీసులోకి కేరళ నుండి ట్రాన్స్‌ఫర్పై వచ్చాడు—అతనూ క్రిస్టియన్ కాబట్టి ఇద్దరూ మంచి స్నేహితులయ్యారు. అప్పుడప్పుడు విలియమ్స్ రాబర్ట్ ఇంటికి వస్తూంటాడు.

ఒక్కొక్క సమయంలో రాబర్ట్ లేనప్పుడు కూడా వచ్చేవాడు విలియమ్స్.

● ● ● ●

విలియమ్స్ చక్కగా మాట్లాడగలడు. మాగ్నెట్‌లా ఆకర్షించుకునే శక్తి ఉందతనిలో. అతని మాటలు వింటూంటే, బాధలతో సతమతమయ్యే క్రిస్టినాకు ఎంతో రిలీఫ్‌గా ఉంటుంది.

రోజులు గడుస్తున్న కొలదీ విలియమ్స్ అందం, అతని కళ్ళలోని మెరుపు క్రిస్టినాను ఆకర్షించసాగాయి.

కానీ, ఇలా చేయకూడదని చాలా సార్లు అనుకుంది. కాని, అది అసాధ్యమైంది.

విలియమ్స్‌తో వెళ్ళిపోవాలని ఆమెలో ఒక కోరిక రగులుకుంటూంది. మరోవైపు తన తపనను అపుకొని భర్తమీదే ఆధారపడి ఉండాలని! ఎంత ప్రయత్నించినా—

అటు భర్త రాబర్ట్—

ఇటు విలియమ్స్—

ఆమెలో ఇదే సంఘర్షణ.

● ● ● ●

క్రిస్టినా వేడిగా నిట్టూరుస్తూ నిద్ర పోతున్న భర్త వైపు జాలిగా చూసింది.

"ఛీ నామనస్సెందు కింత బలహీనమైపోతూంది? భర్తను అన్యాయం చేయకూడదు. తను దిగజారి పోకూడదు" అనుకుంటూ గట్టిగా కళ్ళు మూసు కుంది.

● ● ●

సాయంత్రం విలియమ్స్ తీయటి వూహల్లో విహరిస్తూ రాబర్ట్ ఇంట్లోకి అడుగు పెట్టాడు.

ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. ఒక మూల బాబు కూర్చుని బొమ్మలతో ఆడుకుంటున్నాడు.

ఒక్క క్షణం నిలబడి, లోపలి గదిలోకి ప్రవేశించాడు.

కిటికీ వూచలు పట్టుకుని బయటికి చూస్తూంది క్రిస్టినా.

మెల్లిగా ఆమెను సమీపించాడు.

ఆమె కళ్ళు మూసుకుని ఏదో ఆలోచిస్తూంది.

"క్రిస్టినా ..." పిలిచాడు విలియమ్స్.

. . . .

ఆమె జవాబివ్వలేదు సరికదా, వెనక్కి తిరిగికూడా చూడలేదు.

అతను నెమ్మదిగా, ప్రేమతో ఆమె చెక్కిళ్ళపై మృదువుగా ముద్దు పెట్టుకుని, తనవైపు తిప్పుకొని తన హృదయానికి గట్టిగా హత్తుకున్నాడు.

క్రిస్టినా తుళ్ళిపడి కళ్ళు తెరిచింది. విలియమ్స్ మరోసారి ముద్దు పెట్టుకోబోయాడు.

"విల్లీ ..." అంటూ విసురుగా కౌగిలినుండి విడిపించుకొని దూరంగా జరిగింది.

విలియమ్స్ ఏదో చెప్పాలనుకొని, చెప్పలేకపోయాడు. ఒక నిమిషం ఆగి, అతి ప్రయత్నంగా బావిలోంచి మాట్లాడినట్లు... "క్రిస్టినా... ఐ వాంట్ యూ—అయి లవ్ యూ..."

కొంతసేపు ఆమె అతని కళ్ళలోకి చూసింది సూటిగా. విలియమ్స్ "తొందరపడ్డానేమో" నని కళ్ళు దించుకున్నాడు.

"ప్లీజ్ సిట్, విల్లీ" అని ఎదురుగా ఉన్న కుర్చీలో కూలబడింది క్రిస్టినా ఆలోచిస్తూ.

విలియమ్స్‌లో ఇలాంటి ఆలోచనలు ఉన్నాయని ఇప్పుడే తెలిసింది. ఇప్పుడు తనేం చేయాలి?

కళ్ళు మూసుకుని చాలాసేపటి వరకు కూర్చుండి పోయింది—మాట్లాడే ధైర్యం లేక, అసలు ఏం మాట్లాడాలో తెలియక!

క్రిస్టినాను మాటల్లోకి ఎలా దింపాలో ఆలోచిస్తూ కూర్చున్నాడు — విలియమ్స్.

ఆమె కళ్ళు తెరిచింది.

కళ్ళలోంచి నీళ్ళు జలజలా రాలాయి. వాటిని కొంగుతో తుడుచుకుంటూ, ఏదో నిర్ణయాని కొచ్చినట్లు "విల్లీ...!" అని పిల్చింది.

"వూ..."

"నీ హృదయంలో ఏ ముందో, నీ కోరిక ఏమిటో చెప్పావు. నీ కోరిక తీర్చటానికి నా కేమీ అభ్యంతరం లేదనుకో! కానీ నాదీ వో చిన్న కోరిక... అది నువ్వు తీర్చగలవా?" అడిగింది క్రిస్టినా.

"యు ప్రొసీడ్" అంటూ పాకెట్‌లోంచి కర్చీఫ్ తీసి ముఖానికి పట్టిన చెమటను తుడుచుకున్నాడు.

"చూడు, విలియమ్స్! నా జీవితం గురించి పూర్తిగా తెలియదనుకుంటాను. నేను పెంచుకున్న అందమైన ఆశలు మధ్యలోనే వాడిపోయాయి. నా భర్తకు వో భయంకరమైన వ్యాధి సోకింది. దానికి తోడు నన్నెప్పుడూ అనుమానిస్తూనే ఉంటాడు. నా క్కావల్సిందల్లా శారీరక తృప్తికంటే, మానసిక తృప్తి. ఆప్యాయత, లాలన అసలే లేవు. ఇలాంటి పరిస్థితుల్లో నువ్వు నన్ను ఆకర్షించిన మాట నిజమే! నిన్ను నా వాణ్ణిగా చేసుకోవాలని చాలాసార్లు అనుకున్నా. కానీ ఎందుకో వెంటనే నా భర్త నా కళ్ళలో మెదులుతాడు. నావికుడు లేని పడవలా ఆయన జీవితాన్ని అలా ఆధారం లేకుండా వదిలివెళ్ళిపోవడానికి మనస్కరించడం లేదు. ఇటు భర్త...అటు నువ్వు—ఈ ఆలోచనలతో ఎటూ నిర్ణయం చేసుకోలేక పోతున్నాను. చివరికి వో నిర్ణయానికి వచ్చాను—నీతో నా జీవితాన్ని గడపాలని ...! లిసన్ మీ, విల్లీ ...! కట్టుకున్న భర్తని వదిలి, నీ వెంట వస్తున్న నన్ను ప్రేమించగలవా? జీవితాంతం నాకు ఆశ్రయ మివ్వగలవా? నా బాబును కూడా నాతోనే తీసుకొస్తాను. వాడిని నీకు పుట్టిన వాడిగా చెప్పుకోగలవా? ఏడేళ్ళు కాపరం చేసి, కొడుకుతో సహా భర్తను వదిలి నీ వెంట వస్తే, నీ తల్లితండ్రులు సమ్మతించగలరా? ఒప్పుకోకపోతే, నువ్వు వాళ్ళను ఎదిరించి ధైర్యంగా నాకోసం రాగలవా? కెన్ యూ డూ దిస్ .... టెల్ మీ ...

మరో ముఖ్య విషయం చెబుతున్నా ...

ఏడేళ్ళుగా నేను వో రోగితో కాపరం చేస్తున్నా—ఆ రోగం తాలూకు క్రిములు నా శరీరంలో ఉండి ఉండవచ్చు. దీనివల్ల నీకు ఏమైనా అయితే, నా మీద అనవసరపు నిందలు వేయకూడదు. నేను సహించలేను. నాకు కావల్సింది నీ ప్రేమ ... నీ అనురాగం ... నీ అభిమానం ... ఇన్నాళ్ళు పైకి చెప్పకుండా ఉండి, నువ్వీ రోజున నీ అభిప్రాయం వెలిబుచ్చావు. నా కోరిక తీర్చే ధైర్యం నీలో ఉందని అనుకుంటూ ..." క్రిస్టినా బాధతో భారంగా కళ్ళు మూసుకుంది.

విలియమ్స్ జవాబివ్వలేకపోయాడు.

అలా అయిదు నిమిషాల వరకు సమాధానం రాక పోయేసరికి, "ఏమంటావ్ విల్లీ ...?" అంటూ




క్రిస్టినా కళ్ళు తెరిచింది.

ఎ...దు...రు...గా...విలియమ్స్ లేడు... అడుగుల చప్పుడు వినబడుతోంది.

ఆమె వీధి గుమ్మంలోకి వచ్చింది. తల వంచుకొని గబగబా వెళ్ళిపోతున్నాడు విలియమ్స్. కళ్ళకి దూరమవుతున్న అతన్ని చూస్తూ గుమ్మానికి జారగిలబడింది. క్రమంగా అతను దూరమవుతున్నాడు...

సందు మలుపు దగ్గర ...

రాబర్ట్, విలియమ్స్ కలుసుకున్నారు—రోడ్డుకు రెండు పక్కలా ... అటూ ... ఇటూ ...!

ఒక క్షణం ఇద్దరూ ఒకర్నొకరు చూసుకున్నారు. పలకరించుకోలేదు.

విలియమ్స్ మలుపు తిరిగి కనుమరుగయ్యాడు.

★